‘మిషన్ భగీరథ’పై సమగ్ర సర్వే

- ఇంటింటికీ నల్లా కనెక్షన్‌ల వివరాలు సేకరిస్తున్న అధికారులు
- ప్రత్యేక యాప్‌లో నమోదు

అత్మకూర్(ఎస్) : మిషన్ భగీరథ పథకం అమలు తీరుపై ప్రభుత్వం సమగ్ర సర్వేకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో మండల వ్యాప్తంగా అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ఇంటికీ నీరు సరఫరా అవుతుందా.. లోపాలు ఉన్నాయా.. ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు పదిరోజులుగా ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

30గ్రామ పంచాయతీల్లో

మండలంలోని 30గ్రామపంచాయతీల్లో పాత ట్యాంకులు 31ఉండగా మిషన్ భగీరథ పథకం ద్వారా 55 ట్యాంకులు నిర్మించారు. ఈ ట్యాంకుల ద్వారానే మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. కాగా కొన్ని గ్రామాల్లో అంతర్గతంగా మిషన్ భగీరథ పథకం ద్వారా నూతనంగా పైప్‌లైన్ వేయగా కొన్ని గ్రామపంచాయతీల్లో పాత పైప్‌లైన్‌కు ద్వారానే భగీరథ నీటిని అందిస్తున్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పథకం అమలుపై క్షేత్ర స్థాయి సర్వే..

క్షేత్రస్థాయిలో మిషన్ భగీరథ పథకం అమలు తీరును పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఏఏ అంశాలపై వివరాలు సేకరించాలి, ప్రత్యేక యాప్‌లో ఏ విధంగా నమోదు చేయాలనే అంశంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దీంతో 10రోజులుగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులతో పాటు పలు శాఖల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నీటి సరఫరాపై వివరాలు సేకరిస్తున్నారు. ప్రతి ఇంటికీ కనెక్షన్ ఉందా.. ఇంటికి ఎన్ని లీటర్ల నీళ్లు వస్తున్నాయి..అనే పలు వివరాలు సేకరిస్తూ ప్రతి ఇంటి వద్ద ఫొటో తీసుకొని యాప్‌లో వివరాలను పొందుపరుస్తున్నారు.

సర్వే దాదాపు పూర్తికావచ్చింది

క్షేత్ర స్థాయిలో మిషన్ భగీరథ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టింది. అందులో భాగంగా గ్రామాల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సమగ్ర సర్వే నిర్వహించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. మండలంలో సర్వే చివరి దశకు వచ్చింది.

– హసీం, ఎంపీడీఓ

లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలి



ప్రమాణస్వీకారోత్సవంలో మాట్లాడుతున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తరించాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ సూర్యాపేట 51వ కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో లయన్స్ క్లబ్ ముందుంటుందన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా కొండపల్లి లక్ష్మారెడ్డి, సెక్రటరీగా శబరీనాథ్, కోశాధికారిగా మీలా వంశీ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త మీలా మహదేవ్, ఏఐసీసీ సభ్యులు సర్వోత్తమ్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, శ్రీనివాస్, జగన్మోహన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, కృపాకర్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

అర్వపల్లి : మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలో నేడు ఎమ్మెల్యే మందుల సామేల్ పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మేలు



ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న అధికారులు, రైతులు

అర్వపల్లి : ఆయిల్‌పామ్ తోటల సాగుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ జిల్లా మేనేజర్ జె.హరీష్ అన్నారు. మండల పరిధిలోని కోడూరు గ్రామంలో బుధవారం తోట గురువయ్య అనే రైతు నూతనంగా సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ తోటలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్‌పామ్ తోటలను రైతులు సాగుచేయాలని సూచించారు. ఈ తోటల సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ఈ తోట నాటిన నాల్గవ సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుందన్నారు. సాగుచేసే రైతులకు ప్రభుత్వం బిందు సేద్యం, ఎరువులు, అంతర పంటలకు రాయితీలు ఇస్తుందని తెలిపారు. ఎరువులు, అంతర పంటల యాజమాన్యానికి ఒక ఎకరాకు రూ.4,200 చొప్పున మొదటి నాలుగు సంవత్సరాలు ప్రోత్సాహకం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుచేయాలనే ఆసక్తి గల రైతులు ఉద్యానశాఖ అధికారులకు దరఖాస్తు చేయాలని కోరారు. కార్యక్రమంలో పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ క్షేత్రసహాయకుడు రంగు ముత్యంరాజు, రైతు తోట గురువయ్య, రమేష్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకపోతే సమ్మె చేస్తాం



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు, నాయకులు

భానుపురి (సూర్యాపేట) : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించకపోతే సమ్మెకు దిగుతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అండ్ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని కలెక్టరేట్ ఎదుట గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, చిట్యాల రవిచంద్ర, వెంకటేశ్, స్వరాజ్యం, సయ్యద్, వెంకన్న, దయానంద్, భిక్షం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి



అంగన్‌వాడీ టీచర్లకు కరదీపికలను పంపిణీ చేసిన సీడీపీఓ వెంకటరమణ

తుంగతుర్తి : అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వెంకటరమణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగింపులో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక పాఠశాల (ప్రీ–స్కూల్స్) ను ఏర్పాటు చేస్తున్నామని, అదే విధంగా ప్లేస్కూల్ నిర్వహణపై దిశా నిర్దేశం చేశామన్నారు. గ్రామాల్లోని 3–6సంవత్సరాలు వయస్సు గల పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలో ప్రేరణాత్మక, కృత్యాధార బోధన ఉంటుందన్నారు. విద్యార్థులకు ఆట, పాటలు, ప్రకృతి, సైన్స్, యోగా, గణితంతో పాటు రంగుల బొమ్మలతో ఇతర అంశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించామన్నారు. ప్రతి రోజు ఉదయం 9–4 వరకు వివిధ కార్యక్రమాలు, కృత్యాలతో పిల్లలకు విద్యా బోధన చేయాలని వివరించారు. పిల్లల్లో వచ్చిన మార్పులు అభివృద్ధిని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రమీల, లక్ష్మి, అనురాధ, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విప్లవ పోరాటాల్లో కృష్ణ పాత్ర మరువలేనిది

తుంగతుర్తి : భారతదేశంలో సుదీర్ఘకాలం పాటు జరిగిన విప్లవ పోరాటాల్లో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ పాత్ర మరువలేనిదని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య అన్నారు. బుధవారం మండలంలోని దుబ్బాక సంజీవరెడ్డి విజ్ఞాన కేంద్రంలో డీవీ కృష్ణ రెండో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డీవీ కృష్ణ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. డీవీ కృష్ణ తన జీవితాన్ని పేద ప్రజలకే అంకితం చేశారని అన్నారు. భారత కార్మిక ఉద్యమ నిర్మాణంలో తన పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. భారత విప్లవోద్యమానికి ఒక సైద్ధాంతిక దిక్సూచిగా డీవీకే నిలిచాడన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకులు వేర్పుల పరుశురాం, ఐఎఫ్‌టీయూ నాయకులు మామిడి సుధాకర్, ముజ్జిగ హుస్సేన్, ప్రవీణ్, పూలమ్మ, మానస, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



డీవీ కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

భానుపురి (సూర్యాపేట): జిల్లాలోని హమాలీ, భవన నిర్మాణ, కేజీబీవీ, మోడల్‌స్కూల్, హాస్టల్ వర్కర్స్, గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామళ్ల నవీన్, గంటా నాగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సూర్యాపేట కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు తొత్తుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, సహాయ కార్యదర్శులు నరసింహరావు, మధు, సభ్యులు నర్సిరెడ్డి, రాంనర్సయ్య, లింగయ్య, శ్రీను, నర్సింగరావు, ఉపేందర్, యల్లయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ

నాగారం : మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసు సిబ్బంది మాట్లాడారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అతివేగంతో వాహనాలను నడపరాదని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వి.వెంకన్న, రవీందర్, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



నాగారం : ర్యాలీలో పాల్గొన్న యువకులు, పోలీసులు సిబ్బంది

మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు

నూతనకల్ : మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని తుంగతుర్తి సీఐ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగించడంతో అనారోగ్యం భారిన పడడంతో పాటు విపరీతమైన చెడు ఆలోచనలతో మానవత్వం మర్చిపోయి హింసాత్మక సంఘటనలకు పాల్పడతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రాములునాయక్, ఎస్‌ఐ జె.సైదులు, పీడీ హన్మంతరావు, ఆకారపు జయమ్మ, వీరబోయిన మల్లేష్‌యాదవ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్‌నాయక్



పెన్‌పహాడ్ : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఐ రవీందర్

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

పెన్‌పహాడ్ : యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ రవీందర్, ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులచే అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగానికి యువత బానిసైతే బతుకు చిత్తవుతుందన్నారు. దేశ ప్రజల భవిష్యత్‌కు అత్యంత ప్రమాదకరమన్నారు. మాదకద్రవ్యాల రవాణాను అమ్మకం, కొనుగోళ్లను భావిభారత పౌరులుగా విద్యార్థులు అడ్డుకొని వారిని పోలీసులకు పట్టించాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి స్రవంతి, ఏపీఎం అజయ్‌నాయక్, ఉపాధ్యాయులు, మండల పారా లీగల్ వలంటీర్లు గజ్జల ధర్మారెడ్డి, వరకాల అంజయ్య, ప్రవీణ్, సీఆర్‌పీఎఫ్ మండల కమిటీ సభ్యులు దాసరి మట్టయ్య, కందిమళ్ల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

భానుపురి (సూర్యాపేట) : పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. బుధవారం వారు హైదరాబాద్‌లో త్రిసభ్య కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, డాక్టర్ చిన్నారెడ్డిలను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడారు. నగదు రహిత వైద్యం, పెండింగ్‌లో ఉన్న 4డీఏ బకాయిలు, ఈకుబేర్‌లో దీర్ఘకాలికంగా మంజూరు కాని బిల్లులు, 2023 వేతన సవరణ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమస్యలను పరిష్కరించే దిశగా త్రిసభ్య కమిటీ నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు భాగ్యమ్మ, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ కోదండరాంను సన్మానిస్తున్న సంఘం నాయకులు

మీసేవ కేంద్రాలు మంజూరు

పెన్‌పహాడ్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అనంతారం, గాజులమల్కాపురం గ్రామాలకు మీసేవ కేంద్రాలు మంజూరైనట్లు ఏపీఎం అజయ్‌నాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మీసేవ నిర్వహణకు మహిళా సంఘంలో సభ్యురాలై ఉండి ఇంటర్మీడియట్ పూర్తి చేసి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. సంఘబంధం సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తు కొలుస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నాగారం : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ధార శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పస్తాల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు బలవర్ధకమైన పౌష్టికాహారం, బాలమృతం అందించాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పిల్లల్లో ఎత్తు, బరువు వృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రవణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు బి.మంజుల, కె.సుశీల, ఏఎన్‌ఎం లక్ష్మీబాయి, ఆశలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

గోండ్రియాల వాసికి డాక్టరేట్



పరిశోధనా గ్రంథం సమర్పిస్తున్న వెలిశాల స్వాతి

సూర్యాపేట: మండలంలోని బాలెంల గురుకుల డిగ్రీ కళాశాల కామర్స్ లెక్చరర్ వెలిశాల స్వాతి కామర్స్ విభాగంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం గోండ్రియాల గ్రామానికి చెందిన వెలిశాల వెంకటాచారి, ధనమ్మల కుమార్తె స్వాతి కామర్స్ విభాగంలో ‘ప్రెసింగ్ ఎఫెక్ట్స్ ఆఫ్ ఐపీయూఎస్ ఏ స్టడీ ఆన్ బీఎస్ఈ లిస్టెడ్ ఎస్ఎంఈఎస్’ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకున్నారు.

అధ్వాన డొంకదారితో అవస్థలు

తుంగతుర్తి : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు ప్రభుత్వం వసతిగృహాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే మండల కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం మూడు వసతిగృహాలను నిర్మించారు. విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వాలు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెబుతున్నా ఆచరణలో విఫలమవుతున్నాయి. మండల కేంద్రంలోని ఎస్టీ, ఎస్సీ వసతిగృహాలకు వెళ్లడానికి దారి లేక విద్యార్థులు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి. వసతిగృహాలకు వెళ్లే దారి డొంకదారి కావడంతో ఆ దారిలో వర్షాలు పడినప్పుడల్లా బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుంది. ప్రభుత్వాలు మారుతున్నా, ప్రజాప్రతినిధులు మారుతున్నా వసతిగృహాల్లో మాత్రం సమస్యలు పరిష్కారం కావడం లేదు. గత ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ తన సొంత నిధులతో వసతిగృహాలకు వెళ్లడానికి సీసీరోడ్డు మంజూరు చేశారు. దీంతో అధికారులు కొంతవరకు నిర్మాణం చేసి మిగిలిన పనులు వదిలేశారు. సీసీవేయని దారిలో వెళ్లాలంటే రాత్రిపూట నానా అవస్థలు పడుతున్నారు. అదే విధంగా ఈ దారిలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రిసమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సామేల్ స్పందించి వసతిగృహాలకు రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



తుంగతుర్తిలో ఎస్టీ, ఎస్సీ వసతిగృహాలకు వెళ్లే డొంకదారి

ఆర్థికసాయం అందజేత

నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామానికి చెందిన యాల యాదగిరి ఇంట్లో ఇటీవల జరిగిన షార్ట్‌సర్క్యూట్‌తో సుమారు రూ.5లక్షల ఆస్తినష్టం జరిగింది. దీంతో గ్రామానికి చెందిన ప్రతిభ యూత్ సభ్యులు బుధవారం బాధిత కుటుంబానికి రూ.6వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రతిభ యూత్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పేరాల యాదగిరి, సహాయ కార్యదర్శి వంగూరి కుమార్, మహేష్, సమ్మయ్య, అవిలమల్లు, అబ్బాస్, రాజు, దుర్గస్వామి, మహేష్, సురేష్, దయానంద్, వెంకటేష్ పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన కట్ల లింగయ్య ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లింగయ్య కుటుంబాన్ని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్ బుధవారం పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాజీ ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్, నాయకులు కుంభం సతీష్, ఈద కోటిప్రసాద్, సైదులు, సంపత్, మనోహర్ తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేసే వారే ఎంచుకోవాలి

భానుపురి (సూర్యాపేట) : ప్రస్తుతం జరుగుతున్న సాధారణ ఉపాధ్యాయుల బదిలీల్లో అంకితభావంతో ఇంగ్లిష్ మీడియంలో బోధించగల ఉపాధ్యాయులే పిల్లలమర్రి ప్రాథమిక పాఠశాలను ఎంచుకోవాలని స్ఫూర్తి అసోసియేషన్ సభ్యులు మాదగోని ఉపేందర్, పల్స కాంత్రి అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్నందున ప్రిపరెన్షియల్ కేటగిరిలో ఉన్న ఉపాధ్యాయులు పిల్లలమర్రి పాఠశాలలను ఎంచుకోవద్దని కోరారు. కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ దేవరశెట్టి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

క్లుప్తంగా

ఇంటర్ ఒకేషనల్‌లో విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల చైర్మన్ విజయలక్ష్మి

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణంలోని శ్రీలక్ష్మివెంకటసాయి ఒకేషనల్ కళాశాల విద్యార్థులు సోమవారం వెలువడిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులు ఇంప్రూవ్‌మెంట్ రాయగా ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) విభాగంలో కె.వంశవర్ధిని 500మార్కులకు గాను 494మార్కులు సాధించించింది. అదే విధంగా ఫిజియోథెరపిలో 491మార్కులు వి.గణేష్‌తో పాటు పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం కళాశాల చైర్మన్ విజయలక్ష్మి, కరస్పాండెంట్ బాలగౌడ్, ప్రిన్సిపల్ స్వాతి అభినందించారు.

చెక్‌డ్యాం నిర్మాణ స్థలం పరిశీలన



చెక్‌డ్యాం నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండలంలోని తాటిపాముల–వస్తాకొండూర్ మధ్యలోని బిక్కేరువాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టేందుకు ఐబీ అధికారులు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తాటిపాముల గ్రామకాంగ్రెస్ నాయకులు బిక్కేరువాగుపై చెక్‌డ్యామ్ నిర్మించాలని వినతిపత్రం అందజేసిన సంగతి విధితమే. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఐబీ అధికారులు వెంటనే స్పందించి చెక్‌డ్యామ్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. స్థల పరిశీలనలో ఐబీ ఈఈ విజయ్‌కుమార్, డి.సత్యనారాయణ, జేఈ చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు ఎర్ర యాదగిరి, నాయిని అంజయ్య, పరశురాములు, బోయపల్లి కిషన్, వయ్యముల రమేష్, చెరుకు సోమయ్య, బోయపల్లి రాములు, కృష్ణ తదితరులున్నారు.

మొహర్రం నాటికి భవనం పూర్తి



భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు రేఖ

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల గ్రామంలో రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పీర్లకొట్టం భవన నిర్మాణ పనులను ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి డాక్టర్ బోయలపల్లి రేఖ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రేఖ మాట్లాడారు. గ్రామంలో సుమారు రూ.5లక్షలతో నిర్మిస్తున్న పీర్లకొట్టం భవనం స్లాబ్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరగా పూర్తిచేసి మొహర్రం నాటికి ప్రారంభిస్తామని తెలిపారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ మడ్డి పద్మ, గ్రామ ముస్లింలు, తదితరులు ఉన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ సునీత

నూతనకల్ : ప్రభుత్వం అందిస్తున్న పథకాల కోసం అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ సునీత అన్నారు. బుధవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపాలన సేవా కేంద్రం ద్వారా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారంటీలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలోదరఖాస్తుదారులు పాల్గొన్నారు.

సోమయ్య మృతి తీరనిలోటు

నాగారం : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు దిగోజు సోమయ్య మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన సోమయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో పార్టీ ఆధ్వర్యంలో ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపేట కాశయ్య, బయ్యం లింగయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.